క్లుప్తంగా

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

పార్వతీపురం: ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది. ఓటర్లను చైతన్యం చేసేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తోంది. ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటోంది. పోలింగ్ తేదీకి ముందే ఓటరు స్లిప్‌లను ఇంటింటికి పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్నికల స్లిప్‌తో పాటు గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రంలో ఓటర్లు చూపించాల్సి ఉంటుంది. ఓటరు స్లిప్‌తో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు లేదా పోస్టాఫీసు జారీ చేసిన పాస్‌బుక్‌లు, పాన్‌కార్డు, కార్మికశాఖ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు, కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటోతో పాటు ఉండే పింఛన్ కార్డులలో ఏదో ఒకదాన్ని గుర్తింపు కార్డుగా చూపించవచ్చు.

పశువైద్యులు పనితీరు మెరుగుపర్చుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మన్మథరావు

సీతానగరం: పశువైద్యాధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని పశువైద్యశాఖ కార్యాలయంలో బలిజిపేట, సీతానగరం పశువైద్య సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. వంద శాతం ఆడదూడలు జన్మించేలా చేసే కృత్రిమ గర్భధారణపై, వేసవిలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ దీనకుమార్, పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ నీలయ్య, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె.ప్రసాదరావు, డాక్టర్ రామారావు, డాక్టర్ జి.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలలో డేటా లోడింగ్ పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్వో విష్ణుచరణ్

సాలూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలలో ఎన్నికల డేటా (పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులు) లోడింగ్ ప్రక్రియను ఆర్వో, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శుక్రవారం పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. పోలింగ్ విధులను పూర్తి అప్రమత్తతతో నిర్వహించాలని, సందేహాలేమైనా ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

39 మంది వలంటీర్ల రాజీనామా

పాచిపెంట: మండలంలో పాచిపెంట 1,2, కొటికిపెంట, పి.కోనవలస సచివాలయాల పరిధిలో సేవలందించిన 39 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఎన్నికల కోడ్ పేరుతో ప్రతిపక్ష కూటమి నేతలు తమను ప్రజా సేవకు దూరం చేశారని వాపోయారు. తమకు వలంటీర్లుగా అవకాశం కల్పించిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

కామ్రేడ్ శ్రీరామ్మూర్తి సేవలు మరువలేనివి


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: మండలంలోని రెడ్డివానివలసలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి 3వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు రెడ్డి శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కామ్రేడ్ శ్రీరామ్మూర్తి పార్టీకి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని కార్యకర్తలంతా ప్రజలకు సేవలందించాలని సూచించారు. రైతులు, కార్మికులు, వర్తకులు, వ్యాపారులు, ఇలా అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కామ్రేడ్ శ్రీరామ్మూర్తి సతీమణి శ్రీదేవి, పార్టీ రాష్ట్ర నాయకులు సుబ్బారావమ్మ, ఎం.కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి శంకరరావు, లక్ష్మన్నాయుడు, ఈశ్వరరావు, రమణమూర్తి, ట్రేడ్ యూనియన్ నాయకులు, ఐద్వా నాయకురాలు పాల్గొన్నారు.

పి.రావివలసలో.. శతశాతం సంక్షేమం

- గ్రామంలోని 123 కుటుంబాలకు సంక్షేమ ఫలాలు
- రూ.70 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- గ్రామంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం


నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాల

బలిజిపేట: అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సపరిపాలన అందించారు. ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరిసింది. పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందించారు. పథకాల మంజూరు కోసం ఎలాంటి సిఫార్సులు, లంచాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేశారు. మండలంలోని పెద్దింపేట సచివాలయం పరిధిలో ఉన్న పి.రావివలస గ్రామంలో ఉన్న అన్ని కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందాయి.

గ్రామంలో 123 కుటుంబాలు ఉండగా.. ప్రతీ కుటుంబానికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరింది. గతంలో కొందరికి పథకాలు అందితే, మరి కొందరికి అందేవి కాదని, జన్మభూమి కమిటీల సిఫార్సులు, లంచాలు లేనిదే పథకాలు మంజూరు చేసేవారు కాదని గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా సంక్షేమ పథకాల నగదు జమ అవుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టారు. పి.రావివలస నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న పదమాయవలస-వెంగాపురం జంక్షన్ వరకు రూ.70 లక్షలతో బీటీరోడ్డు నిర్మించారు. గతంలో రోడ్డు సదుపాయం లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడేవాళ్లమని, అత్యవసరమ పరిస్థితిలో 108 వాహనం కూడా వచ్చేది కాదని గ్రామస్తులు అంటున్నారు. అలాగే ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి 10 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఎస్టీ వీధి నుంచి ఎస్సీ వీధి వరకు సీసీరోడ్డు, శ్మశానవాటికకు వెళ్లేందుకు గ్రావెల్‌రోడ్డు వేశారు. నాడు-నేడు నిధులు రూ.16 లక్షలతో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు.

ఎవరికీ లంచాలు ఇవ్వలేదు



ఈ ప్రభుత్వంలో అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందించారు. మాకు కూడా పథకాలు అందాయి. పథకాల కోసం ఎవరి వద్దకు వెళ్లలేదు. ఎవరికీ లంచాలు ఇవ్వలేదు. వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి మా అర్హతలను బట్టి పలు పథకాలకు దరఖాస్తు చేశారు. మంజూరైన పథకాల నగదు మా ఖాతాలో నేరుగా జమ అయింది. గత ప్రభుత్వంలో ఎన్నడూ ఈ విధంగా పథకాలు అందలేదు.

– ఎం.లక్ష్మి, పి.రావివలస, బలిజిపేట మండలం

అర్హత ఉంటే చాలు..



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులకు నేరుగా పథకాలు అందుతున్నాయి. మా ఇంట్లో ఉన్న అందరికీ అర్హతను బట్టి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాతే మాకు పింఛను అందింది. ఎవరు ఏ పార్టీ అని లేదు. పథకానికి అర్హులయితే చాలు నేరుగా పథకం డబ్బులు జమ అవుతున్నాయి.

– పి.సత్యనారాయణ, పి.రావివలస, బలిజిపేట మండలం


పి.రావివలస గ్రామం


కొత్తగా నిర్మించిన బీటీరోడ్డు

కూటమి కుట్ర.. అవ్వాతాతలకు కష్టాలు


పెదబోగిలి ఎస్‌బీఐ సీసీ సెంటర్ వద్ద పింఛన్ల కోసం గుమిగూడిన లబ్ధిదారులు

సీతానగరం: టీడీపీ కూటమి చేసిన కుట్రలతో పింఛన్ లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. పింఛన్ డబ్బుల కోసం బ్యాంకుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మార్చి నెల వరకు వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందించేవారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుచరుడు నిమ్మగెడ్డ రమేష్‌తో పింఛన్ల పంపిణీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వలంటీర్ల సేవలు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి బ్రేక్ పడింది. గత రెండు నెలలుగా పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మే నెల పింఛన్‌ను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు లబ్ధిదారుల బ్యాంకుల వద్ద బారులుతీరుతున్నారు. మండుటెండలో అవస్థలు పడుతూ కనిపించారు. ఈ పాపం చంద్రబాబుదే అని, మా ఉసురు తప్పకుండా తగులుతుందని ప్రతిపక్ష నేతలను పింఛన్‌దారులు దుమ్మెత్తిపోస్తున్నారు.

సాలూరు రూరల్: చంద్రబాబునాయుడు కారణంగానే తమకు ఈ కష్టాలు వచ్చాయని పలువురు పింఛన్ లబ్ధిదారులు మండిపడుతున్నారు. పింఛన్ డబ్బులు తీసుకునేందుకు మామిడిపల్లి విశాఖ గ్రామీణ బ్యాంకు వద్దకు శుక్రవారం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు చేరుకున్నారు. గంటల తరబడి మండుటెండలో నిరీక్షించాల్సి రావడంతో ఎంతో ఇబ్బంది పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లతో ఇంటి వద్దకే పింఛన్లు పంపిస్తే.. చంద్రబాబునాయుడు అడ్డుకున్నాడని, రాజకీయ లబ్ధి కోసం తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.


మక్కువ: మక్కువ స్టేట్‌బ్యాంక్ వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు


మక్కువ: పింఛన్ డబ్బులు తీసుకునేందుకు బ్యాంకుకు వస్తున్న వృద్ధుడు


సాలూరు రూరల్: మామిడిపల్లి విశాఖ గ్రామీణ బ్యాంకు వద్ద పింఛన్ల కోసం వేచిఉన్న లబ్ధిదారులు

పగవాడికి కూడా ఈ కష్టం రాకూడదు



నాపేరు అల్లు నారాయణమ్మ. మాది మక్కువ మండలం, పాపయ్యవలస గ్రామం. నేను గత రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. రెండు నెలల కిందట వరకు వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. పార్వతీపురం వెళ్లి మందులు కొని తెచ్చుకునేదానిని. ఈ నెల పింఛన్ డబ్బులు ఇంతవరకు అందలేదు. మందులు కొనేందుకు డబ్బులు లేకపోవడంతో జర్వం అయినప్పటికీ బ్యాంకుకు రావాల్సి వచ్చింది. ఇలాంటి కష్టం పగవారికి కూడా రాకూడదు.

చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది



ఎన్నికల ముందు టీడీపీ నాయకులు వలంటీర్లు సేవలు ఆపించడంతో వృద్ధులమంతా చాలా ఇబ్బందులు పడుతున్నాం. పింఛన్ డబ్బులు బ్యాంకులో వేయడంతో వాటిని తీసుకునేందుకు మా ఊరు నుంచి రెండు కిలోమీటర్లు నడిచి వెంకటభైరిపురం వచ్చి, అక్కడ నుంచి ఆటోలో మక్కువ రావాల్సి వచ్చింది. ఇంత మండుటెండలో మా లాంటి వృద్ధులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

– సింగనాపల్లి సత్యం, వృద్ధుడు, డీ.శిర్లాం గ్రామం, మక్కువ మండలం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం..


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే తాటతీస్తానని డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. పట్టణంలో బంగారమ్మకాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన రాజన్నదొరతో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న కొందరు టీడీపీ నాయకులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. దీనిపై రాజన్నదొర స్పందిస్తూ.. ఎన్నికల ప్రచారం ఏ పార్టీ వారైనా చేసుకోవచ్చని, కానీ ఓటర్లు తమకు నచ్చిన వారికి ఓట్లు వేస్తారన్నారు. కాలనీకి చెందిన టీడీపీ నాయకులు నా వద్దకు వచ్చినపుడు పార్టీలకు అతీతంగా పనులు చేసి పెట్టానని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని, వారి తాటతీస్తానని హెచ్చరించారు. కాలనీలో 6,490 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.17 కోట్లు అందించామన్నారు. 120 మందికి టిడ్కో ఇళ్లు ఇచ్చామని వివరించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని గుర్తుచేశారు. అవే హామీలను పేరుమార్చి నూతన మేనిఫెస్టోగా తీసుకొచ్చి ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, టీడీపీ మాయమాటలు నమ్మొద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సుపరిపాలన అందించిన జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతివ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతివ్వాలని, ఎమ్మెల్యేగా జోగారావును, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. మండలంలోని బెలగాంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం కుటుంబాలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మాన మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం ముస్లింలను అన్ని విధాలా ఆదుకుందని, భవిష్యత్‌లో కూడా అండగా ఉంటుందన్నారు. షాదితోఫా, హజ్ యాత్రకు వెళ్లేవారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, నవరత్న పథకాల ద్వారా ముస్లిం మహిళలకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని రూరల్ సీఐ రవికుమార్ కోరారు. మండలంలోని అంటిపేట, కాశీపేట, చినబోగిలి గ్రామాల్లో ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాల సిబ్బంది శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాలూరు: పట్టణంలో ఏఎస్పీ సునీల్‌సియోరాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల వేళ అందరు సంయమనం పాటించాలని, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు వాసునాయుడు, బాలకృష్ణ, ఎస్సైలు సురేష్, సీతారాం, రమణ పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే జోగారావు అన్నారు. సాలూరు, పార్వతీపురం మండలాల్లో శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటి వద్ద మహిళలు వారికి హాజరుతు ఇచ్చి స్వాగతం పలికారు. ప్రచారంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రాజన్నదొర, జోగారావుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


వెంగాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్


సాలూరు: పెదకోమటిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజన్నదొరకు హారతిస్తున్న మహిళలు


సాలూరు రూరల్: మామిడిపల్లిలో ఇంటింటి ప్రచారంలో సువ్వాడ రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు


బలిజిపేట: బర్లిలో ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు


సాలూరు రూరల్: బారిగాం గ్రామంలో రాజన్నదొరకు మద్దతుగా ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి


సాలూరు: బంగారమ్మకాలనీలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న పీడిక రాజన్నదొర


సాలూరు: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర


సీతానగరం: లచ్చయ్యపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావుకు సంఘీభావం తెలియజేస్తున్న స్థానిక నాయకుడు ఎస్.చిన్నారావు(దొర)


మక్కువ: చప్పబుచ్చమ్మపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు రంగునాయుడు


మక్కువ: ఎం.పాలికవలస గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రచార ర్యాలీ..


సీతానగరం: పెదబోగిలిలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ ఎస్.గౌరీ, నానారావు, లక్ష్మీ, తదితరులు


సీతానగరం: ఫ్యాన్ గుర్తుపై ఓటువేయాలని కోరుతూ నీలకంఠాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు